క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పారాయణం చేస్తున్న పూజారులు

జైపూర్: మండల కేంద్రంలో గల భానీల సమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం వైభవంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి రోజున సామూహిక శ్రీ విష్ణు సహస్రస్తోత్ర పారాయణం ఉత్సవానుజ్ఞ, భగవత్ప్రార్థన, శ్రీ విష్వక్సేనారాధన వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధాన వ్యవస్థాపకులు బల్మూరి ఉష–అరవీందర్, భక్తులు పాల్గొన్నారు.

సింహగర్జనకు తరలిన మాలలు



భీమారం నుంచి వెళ్తున్న మాలలు

భీమారం/దండేపల్లి/బెల్లంపల్లిరూరల్/మందమర్రిరూరల్/వేమనపల్లి/జైపూర్/రామకృష్ణాపూర్/కాసిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాల సింహగర్జన సభకు జిల్లాలోని మాల కులస్తులు ఆదివారం ప్రత్యేక బస్సులు, కార్లలో తరలివెళ్లారు.

ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీ

భీమారం: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లను వివిధ జిల్లాలకు బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పున్నం, సంపూర్ణ భూపాల్‌పల్లికి, చంద్రమోహన్ ములుగు జిల్లాకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్త వారిని నియమించలేదు. శిక్షణ పొందిన 8మంది కానిస్టేబుళ్లు విధుల్లో చేరారు.

వేంపల్లిలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలో ఆదివారం లయన్స్ క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర, సాధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రోగ్రాం చైర్మన్‌గా మాజీ సర్పంచ్ డేగ బాపు వ్యవహరించగా వైద్యులు చంద్రదత్, సురేశ్, నిశాంత్‌లు జనరల్ మెడిసిన్, న్యూరో, దంత పరీక్షలు నిర్వహించగా స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 25మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని గుర్తించగా, పలువురికి వైద్య పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు బాల్‌మోహన్, రామాంజనేయులు, వినయ్‌కుమార్, గుండా శ్రీనివాస్, సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

'సీఎంను విమర్శించే హక్కు చిన్నయ్యకు లేదు'

బెల్లంపల్లిరూరల్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌లను విమర్శించే నైతిక హక్కు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు లేదని ఆరిజిన్ డెయిరీ మేనిజింగ్ డైరెక్టర్ కందిమల్ల ఆదినారాయణ అన్నారు. బెల్లంపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ప్రజల చేతిలో తిరస్కరణకు గురైన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సీఎం, బెల్లంపల్లి ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేదిలేదన్నారు. సమావేశంలో రామటెంకి హరిబాబు, చల్లూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాల మల్లేశ్ చిత్రపటం వద్ద నివాళి



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌలు, పట్టణ కార్యదర్శి ఖలీందర్ అలీఖాన్, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగం రవి, నర్సయ్య, రాజలింగు పాల్గొన్నారు.

గురుకులాల్లో వసతులపై ఆరా..!

- బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో హాస్టళ్ల సందర్శన
- విద్యార్థులను అడిగి సమస్యలు తెలుసుకున్న పార్టీ నాయకులు



కోటపల్లి ఎస్సీ హాస్టల్ ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

కోటపల్లి: రాష్ట్రంలో గురుకులాల్లో జరుగుతున్న అనేక సంఘటనలు దృష్టిలో ఉంచుకొని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదివారం గురుకులాల బాట పట్టారు. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి మారిశెట్టి విద్యాసాగర్ ఆధ్వర్యంలో గురుకుల బాట ఇన్‌చార్జి చైతన్య, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌లతో కోటపల్లి ఎస్సీ హాస్టల్ సందర్శనకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్‌ఎస్వీ నాయకులను అనుమతి లేదని ఎస్సై రాజేందర్ అడ్డుచెప్పడంతో బీఆర్‌ఎస్ గేటు ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్వీ నాయకులను హాస్టల్ సందర్శనకు అనుమతినిచ్చారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రెగ్యులర్ వార్డెన్ లేకపోవడం, భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరిందని విద్యార్థులు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. బాత్‌రూంలు కంపుకొడుతున్నాయని, వంటగదిలో లైట్ సౌకర్యం కూడా లేక దోమలతో నిండి ఉందన్నారు. కార్యక్రమంలో చందు, అనిల్, రాజుకుమార్, పవన్, నూతన్ పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్: బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్వీ నాయకులు గురుకులాల బాట పట్టారు. బెల్లంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల పాఠశాల ఎదుట ఆదివారం బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. తాళ్లగురిజాల ఎస్సై రమేష్ అక్కడికి చేరుకొని నిరసన కారులతో మాట్లాడారు. అనంతరం నాయకులు గురుకుల పాఠశాలలోని పరిసరాలను, వంటగదిని తనిఖీ చేసి వంటలు పరిశీలించారు. శ్రావణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌లు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ పైశాచిక ఆనందం పొందుతోందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు చైతన్య, బెల్లంపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనాథ్, పట్టణ అధ్యక్షుడు అరుణ్, నాయకులు అఖిల్, సాయి, అశోక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: స్థానిక గురుకుల పాఠశాలను ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సందర్శించారు. వంటగది, వసతులపై ఆరా తీశారు. కాంగ్రెస్ పాలనలో గడిచిన 11నెలల్లో 52మంది విద్యార్థులు మరణించారని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని ధ్వజమెత్తారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు డా. రాజారమేష్, సుదర్శనగౌడ్, రామిడి కుమార్, కౌన్సిలర్స్ ఉన్నారు.

ప్రజల రక్షణే కర్తవ్యంగా విధులు నిర్వర్తించాలి

- బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లిరూరల్: ప్రజల రక్షణే ప్రథమ కర్తవ్యంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవి కుమార్ అన్నారు. బెల్లంపల్లిరూరల్, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లకు కేటాయించబడిన నూతన పోలీసు సిబ్బందితో బెల్లంపల్లి రూరల్ సీఐ కార్యాలయంలో ఆదివారం పరిచయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీసుస్టేషన్లకు నూతనంగా వచ్చిన 26మంది పోలీసు సిబ్బందితో మాట్లాడారు. పోలీసులు విధులపై అంకిత భావంతో బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని చేపట్టారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజీ పడొద్దని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దిన్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య, టూటౌన్, తాళ్లగురిజాల, నెన్నెల ఎస్సైలు మహేందర్, రమేష్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: విధి నిర్వహణలో కానిస్టేబుళ్ల అంకితభావంతో నిర్వర్తించాలని, ఎలాంటి రాజీ పడకుండా శాంతి భద్రతలు కాపాడాలని నూతనంగా విధుల్లో చేరే కానిస్టేబుళ్లకు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. మందమర్రి సర్కిల్ కార్యాలయంలో నూతనంగా కేటాయించబడిన 23మంది పోలీస్ కానిస్టేబుళ్ల పరిచయ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజల రక్షణ, ప్రథమ కర్తవ్యంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా, విధి నిర్వహణలో బాధ్యతలు మరువకుండా ప్రజలకు న్యాయం చేసే విధంగా కానిస్టేబుళ్లు విధులు నిర్వహించాలని ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్, దేవాపూర్ ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాండూర్: పోలీసులు విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. తాండూర్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరిన సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. తాండూర్ సర్కిల్ పరిధిలో మొత్తం 25మంది సిబ్బంది నూతనంగా విధుల్లో చేరారు. సమావేశంలో తాండూర్ సీఐ కె. కుమారస్వామి, మాదారం, భీమిని, కన్నెపల్లి ఎస్సైలు సౌజన్య, విజయ్, గంగారాం, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఎంపిక

మంచిర్యాలఅర్బన్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జిల్లా స్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన (ఆర్‌బీవీపీ), ఇన్‌స్పైర్ అవార్డులలో నైపుణ్యాలను ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థుల వివరాలను డీఈవో యాదయ్య ప్రకటించారు.

ఆర్‌బీవీపీలో..

విద్యార్థి పేరు	పాఠశాల
సీహెచ్ శశాంత్	యూఆర్‌ఎస్, మంచిర్యాల
ఎం.కార్తీక్	టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, సీవోఈ, బెల్లంపల్లి
తరుణి	కార్మెల్ హైస్కూల్, మంచిర్యాల
గణేశ్	డీఏవీవో జ్ఞానమందిర్ దేవాపూర్
శ్రీనిత్యవిదాత్రి	డీఏవీవో జ్ఞానమందిర్, దేవాపూర్
సాయిచరణ్	జెడ్పీహెచ్‌ఎస్ భీమారం
సందేశ్	జెడ్పీహెచ్‌ఎస్ కిష్టాపూర్
కుషాలి	మౌంట్ కార్మెల్‌స్కూల్, హాజీపూర్
సాయికేశవ	జీహెచ్‌ఎస్ సినిమావాడ, మంచిర్యాల
శివాని	జెడ్పీఎస్‌ఎస్ లక్షెట్టిపేట
లక్ష్మణ్	కార్మెల్ హైస్కూల్, మంచిర్యాల
ఆదిత్య	సీవోఈ బాయ్స్
రాంచరణ్	జెడ్పీఎస్‌ఎస్, బెల్లంపల్లి
భువన్	జీహెచ్‌ఎస్ ఓల్డ్‌మంచిర్యాల

టీచర్ టీఎల్‌ఎంలో..

శ్రీనివాస్	యూపీఎస్ కాసిపేట

సెమినార్‌లో...

సాహిత్య	టీజీఎంఎస్ మంచిర్యాల

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులో..

విద్యార్థి	పాఠశాలపేరు
శరణ్య	జెడ్పీఎస్‌ఎస్ 2ఇంక్‌లైన్, బెల్లంపల్లి
జెస్లీ	జెడ్పీఎస్, రెబ్బనపల్లి
అక్షర	భీమారం, కేజీబీవీ
సాయితేజ	జెడ్పీఎస్‌ఎస్ బాయ్స్, జన్నారం
శ్రావణ్‌కుమార్	జెడ్పీహెచ్‌ఎస్, అన్నారం
చరణ్‌తేజ	జెడ్పీహెచ్‌ఎస్, అన్నారం
ఆరాధ్య	టీఎస్ఎంఎస్, మంచిర్యాల
వర్షిత	రివిలేషన్‌స్కూల్, మంచిర్యాల
సాత్విక్	జెడ్పీబాయ్స్, ఒర్రెగడ్డ, మందమర్రి
హనీదీప్	మదర్‌థెరిస్సా స్కూల్, మందమర్రి
నవ్యశ్రీ	జెడ్పీఎస్‌ఎస్ పొన్నారం
దిలీప్‌కుమార్	డీఏవీవోజీ స్కూల్, దేవాపూర్
ఇంద్రవర్మ	ఎంజేపీబీసీస్కూల్, మంచిర్యాల
అజయ్‌కుమార్	ఎంపీయూపీఎస్, మాదారం
రజనీకాంత్	జెడ్పీహెచ్‌ఎస్ వేమనపల్లి

మందమర్రిలో 'ఆపరేషన్ చబుత్ర'

మందమర్రిరూరల్: మందమర్రిలో ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి పట్టణమంతా గస్తీ తిరిగారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న 35మందిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. 15బైకులు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ చబుత్ర కార్యక్రమంలో భాగంగా సర్కిల్ పరిధి లోని ఐదుగురు ఎస్సైలు 25మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

5న ఎమ్మార్పీఎస్ సమావేశం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఈ నెల 5న నిర్వహించే ఎమ్మార్పీఎస్ మండల సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 5న ఎమ్మార్పీఎస్ మండల, పట్టణ నూతన కమిటీలను వేస్తున్నట్లు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో నూతన కమిటీ నియామకం, భవిష్యత్ కార్యాచరణ విషయాలపై చర్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు చిప్పకుర్తి నారాయణ, మండల నాయకులు విక్రం, మహేందర్, రాజశేఖర్, ప్రవీణ్, నవీన్, రాజేశ్, దుర్గాప్రసాద్, సుధాకర్, రమేశ్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

దండేపల్లి/నెన్నెల/కాసిపేట: నెన్నెల మండలంలోని మైలారం గ్రామానికి చెందిన 200మంది నిరుపేద గిరిజన వృద్ధులకు బెల్లంపల్లి తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, దండేపల్లి మండలంలోని వెల్గనూర్, కాసిపేట, దుబ్బగూడెం, గోండుగూడెం గ్రామాల్లోని 50మంది నిరుపేద వృద్ధులకు లక్సెట్టిపేట సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో, కాసిపేట మండలంలోని గట్రావుపల్లి ఆదివాసీలకు ముత్యంపల్లికి చెందిన మంద అయిలయ్య 100మందికి ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు.

'రానున్నది బీసీల రాజ్యమే'

నస్పూర్: దేశంలో, రాష్ట్రంలో రానున్నది బీసీల రాజ్యమేనని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనగణనలో బీసీలను లెక్కించకపోవడం దేశ ద్రోహమేనన్నారు. బీసీ జనాభా శాతం ప్రకారం రిజర్వేషన్లకై ఉద్యమాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి బీసీ సంక్షేమ సంఘం ఐకే ఓసీ కన్వీనర్ పెట్టం శ్రీనివాస్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్

నెన్నెల: వన్యప్రాణులు, అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని నెన్నెల ఎస్సై ప్రసాద్, కొత్తూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సతీష్ అన్నారు. మండలంలోని కొత్తూర్‌లో నీల్వాయి రేంజ్ అధికారి అప్పలకొండ ఆదేశాల మేరకు ఆదివారం వన్యప్రాణుల సంరక్షణ, అటవీ మంటల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు అమర్చి, ఉచ్చులు బిగించి అటవీ జంతువులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అడవులు మానవ మనుగడకు ఎంతగానో అవసరమన్నారు. రెండు రోజుల క్రితం కొమురంభీం జిల్లాలో ఇద్దరు పత్తి కూలీలపై పులి దాడి చేయగా మహిళా కూలీ చనిపోయిందన్నారు. అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పులి ఇటువైపు వచ్చే అవకాశాలు లేకపోలేదన్నారు. పులి అడుగులు, అరుపులు గమనిస్తూ ఒంటరిగా కాకుండా పనులకు గుంపులు, గుంపులుగా వెళ్లాలని సూచించారు. సాయంత్రం 5గంటల నుంచి ఉదయం 7గంటల వరకు అటవీ ప్రాంతంలోకి ఎవరు కూడా వెళ్లవద్దన్నారు. రాత్రివేళ అటవీ ప్రాంతంలో ఉండటం సురక్షితం కాదని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యుత్ ఏఈ రాజన్న, పోలీసు, అటవీ, విద్యుత్ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ జలీల్, దుగుట రాజలింగు, ప్రజలు పాల్గొన్నారు.

కేబుల్ చోరీతో ఏరియా ఆసుపత్రిలో చీకట్లు



కేబుల్ చోరీకి గురైన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆసుపత్రిలో కేబుల్ చోరీతో చీకట్లు అలుముకున్నాయి. చోరీకి గురైన కేబుల్ ప్రాంతాన్ని ఆదివారం ఏఐటీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి, బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్ సందర్శించి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు చికిత్స అందించే ఆసుపత్రిలో విద్యుత్ కేబుల్ చోరీకి గురికావడం విడ్డూరం అన్నారు. కేబుల్ చోరీ కావడంతో ఆసుపత్రిలో చీకట్లు అలుముకుని కార్మికులకు, రోగులకు వైద్య సేవలు అందడం లేదన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం విద్యుత్ సమస్యపై దృష్టి సారించి హై కెపాజిట్ ఉన్న జనరేటర్, నూతన విద్యుత్ వైరింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి డీఆర్ శ్రీధర్, నాయకులు చిప్ప నర్సయ్య, రత్నం ఐలయ్య, నాగేశ్వర్ రావు, పూర్ణిమ, రాంచందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నస్పూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నస్పూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. విలేజ్ నస్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మండల స్థాయి రినవేబుల్ రిసోర్సెస్ ఎనర్జీ అంశంపై విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈవో యాదయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దామోదర్, మండల నోడల్ అధికారి రామన్న, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు. పట్టణ పరిధిలోని 1, 2, 14 వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది స్పెషల్ శానిటేషన్ కార్యాక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, కమిషనర్ చిట్యాల సతీష్, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని పాఠశాలలో ఆదివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో 'పునరుత్పాదక ఇంధన వనరులు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈవో సురేశ్, సీఆర్‌టీ సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల సందర్భంగా దండేపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో ఆదివారం మండలస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి చౌదరి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండు జనార్దన్, పాత రమేశ్, సీహెచ్ రమేశ్, బొలిశెట్టి రాజన్న, నరేందర్, బిక్క, సీఆర్పీలు నర్సయ్య, రాజ్ మహమ్మద్ పాల్గొన్నారు.

చెన్నూర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా విద్యా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పునరుత్పాదక శక్తి అనే అంశంపై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు మేకల రామస్వామి, మహిపాల్, రమేశ్, సీఆర్పీలు పుప్పాల ప్రవీణ్‌కుమార్, రాజ్‌కుమార్, తొడె శ్రీనివాస్ పాల్గొన్నారు.

అక్రమంగా కలప రవాణా చేస్తున్న వ్యాన్ అడ్డగింత



డీఆర్వోతో మాట్లాడుతున్న గ్రామస్తులు

మందమర్రిరూరల్: ఆవడం నుంచి అక్రమంగా కలప రవాణా చేస్తున్నారని ఆరోపిస్తూ మామిడిగట్టుకు చెందిన పలువురు గ్రామస్తులు ఆదివారం డీసీఎం వ్యాన్‌ను అడ్డుకున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మామిడిగట్టులో ఇదివరకు విధులు నిర్వర్తించిన ఓ అధికారిని నాలుగైదు నెలల క్రితం గ్రామంలోని ఒకరి వద్ద పట్టుబడిన టేకు దుంగలను స్వాధీనం చేసుకొని, ఆ టేకు దుంగలతో పలు వస్తువులు చేసుకొని డీసీఎం వ్యాన్‌లో గద్దరేగడికి తరలిస్తున్నట్లు అధికారులకు తెలిపారు. అనంతరం డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అజార్, సంతోష్ మాట్లాడుతూ.. గతంలో స్వాధీనం చేసుకున్న టేకు దుంగలకు సంబంధించి నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైందన్నారు. ప్రస్తుతం డీసీఎం వ్యాన్‌లో సామగ్రిని మంచిర్యాలలోని ఫారెస్ట్ ఆఫీస్‌కు తరలిస్తున్నామని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులను అడిగితే వ్యాన్‌లోని సామగ్రికి సంబంధించిన రశీదులు ఉన్నాయని తెలిపారు.

ఒకరిపై కేసు

నెన్నెల: మండలంలోని కోణంపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న మహిళా టీచర్‌పై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేసిన రాంటెంకి శ్రీనివాస్ అనే వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. యూ ట్యూబ్‌లో పని చేస్తున్న శ్రీనివాస్ టీచర్‌ను అవమాన పర్చే విధంగా వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారని చెప్పారు. తన మనోభావాలను దెబ్బతీసేలా, పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ పోస్టులు పెట్టినట్లు బాధిత మహిళా టీచర్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వైద్యుడి ఇంట్లో దొంగతనం

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ ప్రముఖ వైద్యుడి ఇంట్లో చోరీ జరిగింది. సీఐ ప్రమోద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపెల్లి చౌరస్తాలోని డాక్టర్ విజయబాబు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఫంక్షన్ పూర్తయిన తరువాత ఇంటికి వచ్చి బెడ్ రూమ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా తాళం రాలేదు. ఉదయం లేచిన తరువాత లాకర్స్ రిపేరర్‌ను పిలిపించి తాళం తీశాడు. కబోర్డ్‌లో ఉన్న నగదు, బంగారం కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్లు అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'కార్మికుల నమ్మకాలు వమ్ముచేస్తున్న ఏఐటీయూసీ'

రామకృష్ణాపూర్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్మికుల నమ్మకాన్ని వమ్ముచేస్తుందని సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్షుడు ఎస్ వెంకటస్వామి ఆరోపించారు. రామకృష్ణాపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. ఇటీవల జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో కార్మికుల ప్రధాన అంశాలను ప్రస్తావించకపోవడమేమిటని ప్రశ్నించారు. రిటైర్డ్ కార్మికుల సమస్యలు, చలి కాలంలో గర్మీకోట్లు, ఆసుపత్రుల్లోని అరకొర వసతులపై యాజమాన్యంతో మాట్లాడలేదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు రాజేందర్, రామస్వామి, సంజీవ్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం

లక్సెట్టిపేట: మండలంలోని ఎలక్ట్రీషియన్, ప్లంబర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పొట్టాల మహేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షుడిగా అబ్దుల్‌నహీం ఎన్నికయ్యారు.

సంక్షిప్త వార్తలు

'ప్రజాపాలన'పై సాంస్కృతిక కార్యక్రమాలు

కాసిపేట: మండల కేంద్రంలోని అంగడి బజారు వద్ద, కోమటిచేను, కొండపూర్ యాప గ్రామాల్లో ఆదివారం తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సారధి బృందం కళాకారులు మామిళ్ల లచ్చన్న, గొడిసెల కృష్ణ, సల్లూరి కృష్ణ, రాంటెంకి రాజాతిరుపతి, వావిలాల నాగలక్ష్మి, సంతోష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఆటల్లో గెలుపోటములు సహజం

భీమిని: ఆటల్లో గెలుపోటములు సహజమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆదివారం ఏసీపీ రవికుమార్ హాజరై విజేతలకు ట్రోఫీ అందజేశారు.

గురుకుల డిగ్రీ కళాశాల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలను ఆదివారం సీనియర్ జడ్జి, డిస్ట్రిక్ లీగ్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ అర్పిత, శ్రీనివాస్‌లు పరిశీలించారు. వంటగది, డైనింగ్‌హాల్, ఆహార నాణ్యత, విద్యార్థుల స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మహిళా చట్టాలు, న్యాయం అందించే విషయాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ వార్షికోత్సవం

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంక్ 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం బ్లడ్‌బ్యాంకులో ఘనంగా నిర్వహించారు. బ్లడ్‌బ్యాంకులో కేక్ కట్ చేసి, రక్తనిధి కేంద్రంలో సేవలను అందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, కార్యదర్శి చందూరి మహేందర్, ఎంసీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

సర్వే డేటా ఆన్‌లైన్లో సరిగ్గా నమోదు చేయాలి

జైపూర్: ఎంపీడీవో కార్యాలయంలో చేపడుతున్న సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను ఆదివారం ఎంపీవో శ్రీపతిబాపురావు పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదును వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.